క్లుప్తంగా

ప్రారంభమైన మద్దానేశ్వరస్వామి జాతర

- 28న బ్రహ్మ రథోత్సవం



మద్దానేశ్వరస్వామి మూలవిరాట్

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో వెలసిన మద్దానేశ్వరస్వామి 81వ రథోత్సవం, పశువుల జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మార్చి 8 వరకు జాతర ఉత్సవం జరుగుతుందని గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో బుధవారం విశేష పూజలు జరిగాయి. 27న కలశ స్థాపన, గణపతి హోమం, పూర్ణాహుతి, 28న శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు. మార్చి 8న ముత్యాల పల్లకీ ఉత్సవంతో స్వామి వారి జాతర ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

కుంభమేళాలో పాల్గొన్న మెట్టు విశ్వ



కుంభమేళాలో నదీ స్నానం ఆచరిస్తున్న మెట్టు విశ్వ, యశోదమ్మ

రాయదుర్గం: మహాశివరాత్రిని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి తన తల్లి మెట్టు యశోదమ్మతో కలసి ప్రయోగ్‌రాజ్‌లో కుంభమేళాలో పాల్గొని గంగ స్నానం ఆచరించారు. అనంతరం ప్రముఖ పుణ్య క్షేత్రం కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్నారు.

వెండి కిరీటం వితరణ



ఉరగాద్రి చౌడేశ్వరీ దేవతకు వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

ఉరవకొండ: పట్టణంలోని ఉరగాద్రి చౌడేశ్వరీ దేవి అమ్మవారికి విశ్రాంత వెటర్నరీ డాక్టర్ బుద్ది రాజశేఖర్ కుటుంబ సభ్యులు బుధవారం రూ.1.25 లక్షలు విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ చైర్మన్ కొత్త శరత్, అర్చకులు కిరీటాన్ని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి సేవా కమిటీ సభ్యులు లక్కా ఎర్రిస్వామి, ఆర్‌సీ ప్రసాద్, రఘు, చెంగల నాగరాజు, నిమ్మల ప్రసాద్, కొత్త భాస్కర్, ఉట్టిధనంజయ, ఉట్టి నారాయణస్వామి, అర్చకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రథం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బొమ్మినేని ఎర్రిస్వామి

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన పార్వతీపరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవానికి ఉపయోగించే రథం శిథిలావస్థకు చేరుకుంది. ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన కోకా బ్రదర్స్, మరికొందరు భక్తులు నూతన రథం నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బుధవారం కూడేరుకు చెందిన బొమ్మినేని ఎర్రిస్వామి నూతన రథం నిర్మాణానికి రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, ఆలయ సేవా కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

కూడేరు: మహిళల్లో చైతన్యం వస్తేనే హక్కులను సాధించుకునేందుకు వీలవుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏపీ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందు మహిళా సమాఖ్య పని చేస్తుందన్నారు. చట్టాలపై అవగాహన కల్పించి మహిళలను చైతన్య పరిచేందుకే ఈ సభ్యత్వ నమోదును చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య నాయకురాళ్లు ఉమాదేవి, వెంకటలక్ష్మి, చిలకమ్మ, అనిత, మీనమ్మ,నారాయణమ్మ, రమణమ్మ, మంజుల, రత్న తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం: లింగాల బండపై వెలసిన పశుపతినాథుడికి ప్రత్యేక పూజలు



గుమ్మఘట్ట మండలం కలుగోడులో అలంకరణలో పరమేశ్వరుడు



కణేకల్లు: అలంకరణలో చిక్కణ్ణేశ్వరస్వామి



బ్రహ్మసముద్రంలో పూజలందుకున్న శివలింగం



ఉరవకొండ: పూజలందుకున్న గవిసిద్ధేశ్వరుడు

హర హర మహాదేవ

- అత్యంత వైభవంగా మహాశివరాత్రి వేడుకలు • శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు • రాత్రంత ఆలయాల్లో భక్తుల జాగరణ

సాక్షిబృందం: మహాశివరాత్రి వేడుకలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం వేకువ జామునుంచే భక్తుల పెద్ద ఎత్తున శైవ క్షేత్రాలకు తరలివెళ్లారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఆయా ప్రాంతాల్లో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా రాత్రి జాగరణలో భాగంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఊరూర పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆదిదంపతుల కీర్తనలతో భక్తులు పరవశించిపోయారు. భక్తులు ఉపవాస దీక్షలతో మొక్కులు చెల్లించారు. లింగార్చనలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు, శివజాగరణతో భక్తి భావం ఉట్టిపడేలా శైవక్షేత్రాలు దర్శమిచ్చాయి.





బొమ్మనహాళ్: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వజ్రకరూరు: శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం



రాయదుర్గం: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో హోమం..



కూడేరు: జోడు లింగాల దర్శనం కోసం భక్తుల క్యూ



ఉరవకొండ: అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి



కూడేరు: స్వయంభు జోడు లింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఘనంగా రుద్రలింగేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: భైరసముద్రం గ్రామంలో బుధవారం రుద్రలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ , గంగ పూజ, హోమం, విశేష పూజలు చేపట్టారు. అనంతరం రుద్రలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, నందికోళ్లు, కీలు గుర్రాలు విన్యాసాలు, కళాకారులు నృత్యాలు నడుమ రథోత్సవం ముందుకు సాగింది. బ్రహ్మసముద్రం రోడ్డు వద్ద ఉన్న పాదాల కట్టవరకు రథాన్ని లాగారు. రథోత్సవానికి తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రేపు వీరభద్రస్వామి రథోత్సవం



అలంకరణలో వీరభద్రస్వామి

వజ్రకరూరు: తట్రకల్లు గ్రామంలో బుధవారం భద్రకాళిసమేత వీరభద్రస్వామి జాతర ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో గణపతి పూజ, రక్షాబంధన, ఉమామహేశ్వర కలశ స్థాపన, రుద్రాభిషేకం, తీర్థప్రసాద వినియోగం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం వీరభద్రస్వామి ఉచ్చాయము లాగుతామని ఆలయ అర్చకుడు రాఘవేంద్రస్వామి తెలిపారు. 28న రుద్రాభిషేకం, స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రామేశ్వరాలయానికి విరాళం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయానికి పెద్ద తిప్పయ్య, ఈశ్వరమ్మ దంపతులు రూ.1,00,116 నగదును అందజేశారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం మల్లికార్జున, మఠం తిప్పేస్వామి, సేవా కమిటీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

రాయదుర్గంటౌన్: ఏపీ బడ్జెట్‌లో బీటీ ప్రాజెక్టుకు కృష్ణానది జలాల తరలింపునకు అవసరమైన రూ.1200 కోట్ల నిధులను కేటాయించాలని బీసీవై పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీటీపీకి లిఫ్ట్ ద్వారా నీటి మళ్లింపు పనులు పునఃప్రారంభించి రైతుల పంట పొలాలకు నీటి అందించే చర్యలు చేపట్టాలన్నారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.961 కోట్లతో బీటీపీకి కృష్ణా జలాలు తీసుకొస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందించి బీటీపీకి నీరు తెచ్చేందుకు అవసరమైన నిధుల విడుదలకు ప్రయత్నించాలన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

కూడేరు: ప్రస్తుతం సమాజంలో సరికొత్త పద్ధతుల్లో వేగంగా జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడేరు పోలీసులు సూచించారు. బుధవారం జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ సమీపంలో పోలీసులు మొబైల్ వాహనం ద్వారా సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు బ్యాంక్ అధికారులమని లేదా మీకు లక్కీ డ్రాలో గెలుపొందారని ఫోన్ చేస్తే నమ్మవద్దన్నారు. ఆధార్, ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దని హెచ్చరించారు. గుడ్డిగా నమ్మి ఓటీపీలు చెబితే మీ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును సులువుగా కాజేస్తారని తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ పి.అష్రఫ్ అలీ

బెళుగుప్ప: స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్‌గా ట్రైనీ డీఎస్పీ పి.అష్రఫ్ అలీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లాకు చెందిన ఈయన 2023 గ్రూప్–1 బ్యాచ్‌లో డీఎస్పీగా ఎంపికయ్యారు. అనంతపురం పీటీసీలో ఏడాది పాటు ట్రైనింగ్ అనంతరం క్షేత్రస్థాయిలో విధులపై అవగాహన నిమిత్తం బెళుగుప్ప స్టేషన్‌కు ఉన్నతాధికారులు పంపారు. నెల రోజుల పాటు స్టేషన్ పరిధిలో కేసులు నమోదు, రికార్డులపై అవగాహన పెంచుకుంటారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఆలేరి రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



నరేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన్ను రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నియమించినందుకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు ఎల్.లోకేష్, వైస్ ఎంపీపీ రమేష్ ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, రామాంజినేయులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానే.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ దగ్గన్న, ఆనంద్‌రెడ్డి, యల్లప్ప, షేక్ ఫరీద్, చిన్న, బుజ్జి, హోతూరు గోవిందు, నుంకేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నరేంద్రరెడ్డి పార్టీ రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులవడంతో బుధవారం ముదిగల్లు గ్రామంలో ఆయన్ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటి సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ గోళ్లసూరి, నాయకులు శ్రీకాంత్, బోరంపల్లి రామిరెడ్డి, జానీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్రగాయాలు



గాయపడిన ఆంజనేయులు


రాయదుర్గంటౌన్: పట్టణంలోని శనీశ్వరాలయం వద్ద నివాసం ఉంటున్న ఆంజనేయులు (60) బుధవారం వినాయక సర్కిల్ వద్ద లారీ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వినాయక సర్కిల్ వద్ద ఆంజనేయులు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో ఓ భారీ లోడు లారీ బస్టాండ్ వైపు టర్న్ తీసుకుంటోంది. అయితే ఆంజనేయులు లారీ కింద పడటంతో రెండు కాళ్లపై టైర్లు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని అనంతపురంకు తరలించారు.

పశుబీమా ప్రీమియం చెల్లింపులో ఉరవకొండ టాప్

ఉరవకొండ: పశుబీమా ప్రీమియం చెల్లింపులో ఉరవకొండ డివిజన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి, ప్రీమియం కట్టించిన ఉరవకొండ డీడీ డాక్టర్ వెంకటేష్‌ను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి అభినందించారు. ఉరవకొండ మండలంలోని అన్ని సచివాలయాలను కలుపుకుని రైతులతో పశుబీమా ప్రీమియం కట్టించిన ఆమిద్యాల పశువైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య పనితీరును ప్రశంసించారు.

శ్రీశైలం పాదయాత్రికులకు అన్నదానం

రాయదుర్గంటౌన్: శ్రీశైల మహా క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కాలినడకన వెళ్లే భక్తులు, శివస్వాములకు రాయదుర్గానికి చెందిన కాంట్రాక్టర్ నేత్రపల్లి కాంతారెడ్డి, అతని మిత్రబృందం 14 ఏళ్ల నుంచి అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటాపురం–శ్రీశైలం మార్గ మధ్య ఫారెస్ట్‌లో (హఠకేశ్వరం వద్ద) నాలుగు రోజులుగా చేపట్టిన అన్నదానం మహాశివరాత్రితో ముగిసింది. రోజుకు దాదాపు 10 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమైనట్లు కాంతారెడ్డి తెలిపారు. రాయదుర్గం నుంచి మధుసూదనరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, తిప్పారెడ్డి, యోగానంద గౌడ, రామన్న, నాగిరెడ్డి, అనిమేష్ తదితరులు అన్నదాన సేవలో పాల్గొన్నారు.



హఠకేశ్వరం వద్ద అటవీ ప్రాంతంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఘనంగా యన్నప్ప తాత ఉత్సవాలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో కొలువైన ఎణ్ణె రంగాధేశ్వరాస్వామి (యన్నప్ప తాత) ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఎణ్ణె రంగనాధేశ్వరస్వామికి వేదావతి హగరి నది నుంచి గంగను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని వచ్చి గంగపూజ, రుద్రాభిషేకం, ఆకుపూజ చేశారు. రాత్రి 7.30 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 5.45 గంటలకు పల్లకీ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు.



అలంకరణలో ఎణ్ణెరంగాధేశ్వరస్వామి

ఖుబా మసీదులో 'దీన్ ఏ జల్సా'

రాయదుర్గంటౌన్: స్థానిక ఖుబా మసీదులో బుధవారం సాయంత్రం దీన్ ఏ జల్సా కార్యక్రమం జరిగింది. ఏడాది నుంచి పాఠశాల స్థాయి చిన్నారులకు తలిమే దీన్ (ఇస్లాం ఆధ్యాత్మిక బోధనలు) పేరిట మక్తాబ్‌లు నిర్వహించారు. చిన్నపాటి సూరాలు, ఖురాన్ సూక్తులు, దువాలు, నాతేపాక్‌లు నేర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వార్షిక జల్సా (సదస్సు)ను నిర్వహించారు. పిల్లలు నేర్చుకున్న సూరాలు తదితర ఆధ్యాత్మిక విషయాలను చదివి వినిపించారు. అనంతరం పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మౌల్వీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోధన చేస్తున్న చిన్నారి, హాజరైన మౌల్వీలు, విద్యార్థులు

బ్రెయిన్ స్ట్రోక్‌తో యువకుడి మృతి



వేణు (ఫైల్)

ఉరవకొండ: మండల పరిధిలోని వై.రాంపురం గ్రామానికి చెందిన బోయ నిమ్మగంటి వేణు (22) బ్రెయిన్ స్ట్రోక్‌తో బుధవారం మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన శివ, చిట్టెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు వేణు, రఘు ఉన్నారు. పెద్ద కుమారుడు వేణు కొంత కాలంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీనికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, తండ్రి శివ ఆరోగ్యం కుడా సరిగా లేకపోవడంతో సమస్యలు చుట్టుముట్టాయి. మంగళవారం సాయంత్రం వేణు కళ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కర్నూలులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

- ఉర్దూ స్కూల్ సమీపంలో 35 ట్రిప్పుల ఇసుక డంప్



వెలుగు చూసిన ఇసుక డంప్

రాయదుర్గం: నియోకవర్గ పరిధిలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తునే ఉన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇటీవల డీ హీరేహాళ్, గుమ్మఘట్ట ప్రాంతాల్లో భారీగా ఇసుక డంప్‌లు పట్టుబడ్డాయి. తాజాగా బుధవారం మెలకాల్మూరు రోడ్డులోని ఓ ఇటుకల బట్టీవద్ద సుమారు 35 ట్రాక్టర్ ట్రిప్పులు ఇసుక డంప్ చేసినట్లు తెలిసింది. దీన్ని కొందరు చిత్రీకరించి వాట్సాప్‌ల్లో ట్రోల్ చేశారు. ఇద్దరు పోలీసులు అటు వైపు వెళ్లి గస్తీ నిర్వహించినా డంప్ ప్రదేశం కనుగొనలేదని సమాచారం. లేక ఎదైనా ఒత్తిళ్ల రావడంతో వెనక్కి వచ్చారా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. పేరుకే చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు కాని అక్రమ రవాణాకు అడ్డుకట్టు పడలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ నగరాజును వివరణ కోరగా.. 'డంప్ ఉన్నట్టు తేలితే సీజ్ చేస్తాం. సిబ్బందిని పంపించి విచారణ జరిపిస్తాం. నిజమని తేలితే బాధ్యులపై కేసులు నమోదు చేయిస్తాం' అని తెలిపారు.

కమనీయం.. కల్యాణం



అలంకరణలో మరకతలింగ రామేశ్వరుడు





పార్వతీపరమేశ్వరులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, కళ్యాణదుర్గంలోని భవాని శంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వేదపండితుడు మదన్‌మోహన్‌శాస్త్రి మంత్రోచ్చారణల మధ్య కనులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవ దాతలుగా శివుడికి వెన్నపూసల తిమ్మారెడ్డి, లత దంపతులు, పార్వతీ దేవికి వీరభద్రి, చంద్రకళ దంపతులు వ్యవహరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల ఊరేగించారు. అలాగే రామేశ్వరాలయంలో మరకతలింగస్వామికి లింగోద్భవ రుద్రాభిషేకం చేపట్టారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కోట వీధిలో వెలసిన అతి పురాతనమైన భవాని శంకరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేపట్టారు. రాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.